

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి

మినీ స్టేడియానికి మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో

అందుబాటులోకి తెస్తాం

- క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం
- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని మినీ స్టేడియానికి త్వరలోనే మరమ్మతులు చేపట్టి త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి అన్నారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శివసేనరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. ఆర్మూర్‌లో నూతన స్టేడియం నిర్మాణానికి త్వరలోనే ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో స్విమ్మింగ్‌ఫూల్ కూడా ఆర్మూర్‌లో నిర్మిస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులకు పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తున్నారని, త్వరలోనే నూతన క్రీడాపాఠశాలను ప్రారంభిస్తామని తెలిపారు. నిజామాబాద్ బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్‌జరీన్‌కు పోలీస్‌శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని కల్పించామన్నారు. అనంతరం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డితో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ఆదిలాబాద్ జట్టు ప్రథమ స్థానంలో నిలువగా మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయస్థానం, వరంగల్ జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్, హ్యాండ్‌బాల్ సంఘం ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగామోహన్‌చక్రు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, కౌన్సిలర్ ఫయాజ్, సీపీ రాజశేఖర్, విద్యాసాగర్‌రెడ్డి, పింజ సురేందర్, గరడి రాజేష్, బాబురావు, రమణ, శ్యామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి



గురుకులాల్లో సమస్యల తిష్ట!

- అద్దె గురుకుల భవనాల్లో అనేక అవస్థలు
- జిల్లాలో 46 గురుకులాల్లో 21 అద్దె భవనాల్లోనే..
- బీసీ గురుకులాల్లో అందని దుప్పట్లు
- చలి కాలంలో స్నానానికి చన్నీళ్లే దిక్కు
- కిటికీలకు డోర్లు, జాలీలు లేక దోమలతో ఇక్కట్లు
- అద్దె గురుకులాల్లో నేలపైనే పడుకుంటున్న విద్యార్థులు
- అద్దె గురుకులాలకు అందని అద్దె

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉత్తమమైన చదువు కోసం ఏర్పాటు చేసిన గురుకులాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సొంత భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో పెద్దగా సమస్యలు లేకపోయినా అద్దెభవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో మాత్రం అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు 46 ఉండగా వాటిలో సుమారు 25వేలకు పైగా వి ద్యార్థులు వసతి పొందుతూ చదువుతున్నారు. జిల్లాలో ఎస్సీ గురుకులాలు 11 ఉండగా 3 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. బీసీ గురుకులాలు 13 ఉండగా 10 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఎస్టీ గురుకులాలు ఐదు ఉండగా ఒకటి అద్దె భవనంలో కొనసాగుతోంది. మైనార్టీ గురుకులాలు 17 ఉండగా.. ఏడు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి సంబంధించి 10 నెలలుగా అద్దె పెండింగ్‌లో ఉంది. సుమారు రూ.5 కోట్ల వరకు అద్దె పెండింగ్‌లో ఉండటంతో అద్దె భవనాల యజమానులు సైతం సంబంధిత భవనాలలో మరమ్మతులు చేయించడం లేదు. ఎన్నిసార్లు విన్నవించిన అద్దె ఇవ్వకపోవడంతో భవన యజమానులు సమస్యలను విన్నవించినా పట్టించుకోవడం లేదు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో విద్యార్థులకు కనీస వసతులు కూడా ఉండటం లేదు. పడుకోవడానికి మంచాలు కూడా లేకపోవడంతో పరుపులు వేసుకొని విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. బీసీ గురుకులాల్లో విద్యార్థులకు ఇప్పటికీ దుప్పట్లు అందకపోవడంతో చలి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చలితీవ్రత జిల్లాలో అధికంగా ఉండగా బ్లాంకెట్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అద్దెభవనాల్లో కిటికీలకు తలుపులు సైతం ఊడిపోగా జాలీలు కూడా లేకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు తమ సొంత డబ్బులతో దోమల నివారణకు మిషన్లు కొనుగోలు చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. చలికాలంలో స్నానం కోసం కనీసం వేడినీళ్లు కూడా ఏ గురుకులాల్లో ఇవ్వడం లేదు. గురుకులాలను తనిఖీలు చేయాల్సిన ఆర్‌సీవోలకు నాలుగు జిల్లాల బాధ్యతలు ఉండటంతో వారు కూడా సరైన పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

గురుకులాల్లో 25వేల మంది విద్యార్థులు

జిల్లావ్యాప్తంగా 46 గురుకులాల్లో 25వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో 11 ఎస్సీ గురుకులాలు ఉండగా వాటిలో 6300లకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో మూడు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా మిగిలిన ఎనిమిది సొంత భవనాలు ఉన్నాయి. మూడు అద్దె భవనాలకు సంబంధించి 10నెలలుగా అద్దె పెండింగ్‌లో ఉంది. బీసీ గురుకులాలు 13 ఉండగా 8700 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మూడు గురుకులాలకే సొంత భవనాలు ఉండగా 10 గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గిరిజన గురుకులాలు జిల్లాలో ఐదు ఉండగా వీటిలో ఒక గురుకుల డిగ్రీ కళాశాల, మినీ గురుకులం, ఏకలవ్య మోడల్ స్కూల్, మరో రెండు పాఠశాల విద్యార్థుల గురుకులాలు ఉన్నాయి. వీటిలో 2200మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు సొంత భవనాల్లో కొనసాగుతుండగా.. ఒకటి అద్దె భవనంలో కొనసాగుతోంది. జిల్లాలో మొత్తం 17 మైనార్టీ గురుకులాలు ఉండగా 8350 మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. 10 సొంత భవనాల్లో కొనసాగుతుండగా 7 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

రూ.5 కోట్ల అద్దె పెండింగ్

జిల్లాలోని 46 గురుకులాల్లో 21 గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో ఎస్సీ గురుకులాలు మూడు ఉండగా 10 బీసీ గురుకులాలు, ఒకటి ఎస్టీ గురుకులం, ఏడు మైనార్టీ గురుకులాలు ఉన్నాయి. ఎస్సీ గురుకులాలకు సంబంధించి 3 గురుకులాల అద్దె గత జూన్ నుంచి సుమారు 50లక్షల వరకు పెండింగ్‌లో ఉంది. బీసీ గురుకులాలకు సంబంధించి 10 గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి సంబంధించి గత జూన్ నుంచి రెండున్నర కోట్లకు పైగా అద్దె పెండింగ్‌లో ఉంది. ఒక ఎస్టీ గురుకులం అద్దె భవనంలో కొనసాగుతుండగా దానికి సంబంధించి 15లక్షల అద్దె పెండింగ్‌లో ఉంది. ఏడు మైనార్టీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా వాటికి సంబంధించి 2 కోట్ల వరకు అద్దె పెండింగ్‌లో ఉంది. అద్దెభవనాలకు సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో గురుకులాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె రాక, చేసిన రిపేర్లకు బిల్లులు రాక అద్దె భవనాల యజమానులు గురుకులాలను ఖాళీ చేయిస్తున్నారు. చేసిన రిపేర్లకు సైతం బిల్లులు మంజూరు చేయడం లేదు. కానీ ఇచ్చే అద్దెలో మాత్రం (...మిగతా 8వ పేజీలో)



బిచ్కుంద, పిట్లం మున్సిపాలిటీలుగా

ఏర్పాటయ్యేనా?

- గత ఏడాదిన్నర క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్న నియోజకవర్గ ప్రజలు
- ఏడాది గడుస్తున్నా ఫలితం శూన్యమే
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

7

కోట్లు వెచ్చించినా.. తగ్గని ప్రమాదాలు!

- ప్రమాదకరంగా సదాశివనగర్‌లోని గ్రామాల రోడ్లు
- ప్రమాదకర మలుపుల వద్ద రూ.6 కోట్లతో పనులు
- అయినా ఆగని ప్రమాదాలు

7





సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఏడాది పాలనలో ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాం

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గ ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాపాలన ఏడాది కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా నుడాచైర్మన్, నగర అధ్యక్షుడు కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, శేఖర్‌గౌడ్, రత్నాకర్‌తో సమావేశం నిర్వహించారు. పదేళ్ల రాక్షస పాలనను పక్కనబెట్టి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు, 500లకే సిలిండర్, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచడం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ప్రజాదర్బార్, అభయహస్తం, ప్రజావాణి కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో పాటు రూ.2లక్షలలోపు రైతులకు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. పంటల బీమాతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించామని, గడిచిన ఏడాదికాలంలో 50వేలకు పైగా ఉద్యోగాలను ఇచ్చిన ఘనత ప్రజాప్రభుత్వానిదన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేశామని గతంలో ఎన్నో లీకేజీలతో ఉన్న టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించడంలో భరోసా ఇచ్చామన్నారు. గల్ఫ్ బాధితులకు సహాయం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుల కోసం ఇప్పటివరకు 57 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని, 2లక్షల రుణ మాఫీ ద్వారా 25లక్షల మంది రైతులకు రుణవిముక్తి చేశామన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేస్తే ప్రతీనెలా 60వేల కోట్ల వడ్డీని ఈ ప్రభుత్వం చెల్లిస్తూనే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు విద్యార్థులకు కాస్మొటిక్, మెస్‌చార్జీలు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. జిల్లాలో మహాలక్ష్మి పథకంద్వారా రూ.3కోట్ల 26లక్షల మంది మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని రోజుకు 93వేల మంది ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని అన్నారు. జిల్లాలో 2లక్షల 20వేల మందికి రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. 2కోట్ల 47వేల మందికి 200 యూనిట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. జిల్లాలో లక్షా 612 మంది రైతులు రుణమాఫీ పొందారని అన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనికి గాను 200 కోట్లు ప్రభుత్వం అప్పులు చెల్లించిందన్నారు. సమావేశంలో నాయకులు జావిద్ అక్రమ్, వేణురాజ్, నరేందర్‌గౌడ్, సంతోష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు బాస్ నియామకమెప్పుడో!?

- పోలీస్ కమిషనర్ బదిలీ అయి 40 రోజులు
- నేటికీ నియామకం కాని కొత్త కమిషనర్
- అదనపు డీసీపీ సైతం బదిలీ
- కొన్నిస్టేషన్ల పరిధిలోని అధికారులపై ఆరోపణలు
- ఇన్‌చార్జి సీపీ ఉన్నా పూర్తిస్థాయి కమిషనర్ లేక పర్యవేక్షణ కరువు

నిజామాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా పోలీస్ కమిషనర్ బదిలీ అయ్యి 40 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ కొత్త కమిషనర్ నియామకం లేదు. ఉన్న అదనపు డీసీపీని కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇన్‌చార్జి కమిషనర్‌ను నియామకం చేసిన పూర్తిస్థాయిలో సమయం కేటాయించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. కమిషనరేట్ పరిధిలో నేరాలతో పాటు ఇతర సమస్యలను నిత్యం సమీక్షించే అధికారి లేకపోవడంతో కొన్నిస్టేషన్ల పరిధిలో ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. రాత్రి పెట్రోలింగ్ నుంచి ఫిర్యాదుల వరకు పర్యవేక్షించే వారు లేకపోవడం వల్ల ఆ ప్రభావం కనిపిస్తుంది. కమీషనర్ లేకపోవడంతో నేతల కనుసన్నల్లో బదిలీపై వచ్చిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అన్నిట్లో తామై వ్యవహరిస్తున్నారు. కొన్ని కేసుల్లో పరిధిని దాటి వ్యవహరించడంతో ఆరోపణలు వస్తున్నాయి. ఇన్‌చార్జి కమిషనర్ నిత్యం పర్యవేక్షిస్తున్నా పూర్తిస్థాయి అధికారి లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త కమిషనర్‌ను నియామకం చేస్తారని నేతలు ప్రకటిస్తున్నా తమకు అనుకూలమైన అధికారిని తెచ్చుకునేందుకు అధికార పార్టీకి చెందిన నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త కమీషనర్ నియామకంపై నేతల ద్వారా సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు నియామకం చేయాలని కోరిన ఇప్పటి వరకు మాత్రం భర్తీ చేయలేదు.

గతనెల 19నే కల్మేశ్వర్ బదిలీ

నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కల్మేశ్వర్ సింగనెవార్ గతనెల 19న బదిలీ అయ్యారు. ఆయన జిల్లా నుంచి కేంద్ర సర్వీసులకు వెళ్లారు. బదిలీ అయిన రోజే ఆయన రిలీవ్ అయ్యారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేషనల్ పోలీస్ అకాడమికి డిప్యూటీ డైరెక్టర్‌గా ఆయన వెళ్లారు. ఆయనతోపాటు డిచ్‌పల్లి ఏడవ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసిన ఆయన సతీమణి కూడా కేంద్ర సర్వీస్‌లోకి వెళ్లారు. ఆయనతోపాటు అకాడమిలో డిప్యూటీ డైరెక్టర్‌గా చేరారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయన తనదైన శైలిలో పని చేశారు. పోలీస్‌స్టేషన్ వారిగా సమీక్షించడంతో పాటు శాంతిభద్రతలను కాపాడటంలో ప్రాధాన్యత ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు లేకుండా నిర్వహణ చేశారు. ప్రధాన మంత్రి నుంచి ముఖ్యమంత్రి సభల వరకు విజయవంతంగా బందోబస్తును నిర్వహించారు. స్టేషన్ల వారిగా నిత్యం సమీక్షించడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపైన చర్యలు చేపట్టారు. కొంతమంది అధికారులను ఐజీ కార్యాలయానికి సరెండర్ చేయడంతోపాటు మరికొందరు అధికారులకు నోటీసులు ఇచ్చారు. కొంతమంది అధికారులను సస్పెండ్ చేశారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారి వరకు ఆరోపణలు వస్తే చర్యలను చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదించడంతో పాటు కొంత మందిని ఐజికి, డిజిపి కార్యాలయానికి సరెండర్ చేసే విధంగా చూశారు. భూకబ్జాలు, మట్కా, గుట్కా, రేషన్ బియ్యం వంటి దందాలో పేర్లు వచ్చిన అధికారులపైన చర్యలు తీసుకున్నారు. స్టేషన్ల వారిగా ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకోవడంతోపాటు కిందిస్థాయి సిబ్బంది సమస్యలను పరిష్కరించారు. ఏడాది కాలం పాటు పనిచేసిన ఆయన లాఅండ్‌ఆర్డర్ గాడిలో పెట్టడంతోపాటు రూల్స్‌కు అనుగుణంగా బాధ్యతలు నిర్వహించారు.

కామారెడ్డి ఎస్పీకే ఇన్‌చార్జి బాధ్యతలు

కల్మేశ్వర్ సింగనెవార్ బదిలీ తర్వాత ఇప్పటివరకు ఏ అధికారిని నియమించలేదు. కామారెడ్డి ఎస్పీకే ఇంచార్జి సీపీగా బాధ్యతలను అప్పచెప్పారు. జిల్లాకు పోలీస్ కమిషనర్ లేక 40 రోజులు అవుతున్నా ఇప్పటివరకు నియామకం చేపట్టలేదు. ఉన్న అదనపు కమిషనర్ అడ్మిన్ కోటేశ్వర్‌రావును కూడా బదిలీ చేశారు. కమిషనర్‌తోపాటు అదనపు డీసీపీ సైతం బదిలీ కావడంతో పాటు కీలకమైన అధికారులు లేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రస్థాయి అధికారుల బదిలీలతోపాటు జిల్లా కమిషనర్‌ను నియమిస్తామని ఉన్నతాధికారుల (...మిగతా 8వ పేజీలో)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేకే

కేసీఆర్‌పై అడ్డగోలు మాటలు

- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌజ్ చూపిస్తే రాజీనామా చేస్తా
- రైతులను నిండా ముంచి సంబరాలా?
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేకే కేసీఆర్‌పై అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే దేశంలోనే అత్యంత వేగంగా గ్రాఫ్ పడిపోయిన సీఎం రేవంత్‌రెడ్డి అని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. రైతులను నిండుగా ముంచి రైతు సంబరాలు, రైతు పండుగ అంటూ పండగలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ రైతులందరికీ జరగలేదని, ఎన్నికలప్పుడు 60లక్షల మంది రైతులకు 40వేల కోట్ల రుణమాఫీ అని అంచనా వేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. రాష్ట్రంలో చేసింది కేవలం 24 లక్షల మందికి 20వేల కోట్ల రూపాయలు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇంకా 34లక్షల మంది రైతులకు 20వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. కేసీఆర్ సీఎంగా కొనసాగిన సమయంలో కాంగ్రెస్ వాళ్లు చేసిన కంటే వెయ్యికోట్ల రూపాయలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎక్కువ చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో 2016-18లో రెండు విడతల్లో కలిసి కేసీఆర్ లక్షలోపు రుణమాఫీ కోసం రూ.2511 కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ కోసం చేసిన ఖర్చు 1517 కోట్లు మాత్రమేనన్నారు. కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలు మానుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు ఏదైనా గ్రామానికి వెళ్లి రుణమాఫీ అందరికీ చేశామని మాట్లాడితే ఆ గ్రామాల్లోనే రైతులే కాంగ్రెస్ వాళ్ల సంగతి చూసుకుంటారని అన్నారు. సకాలంలో ధాన్యంకొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం అమ్ముకున్నారని అన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న 500 బోనస్ అనేకమంది రైతులకు అందలేదన్నారు. బోనస్ ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశ్యంతోనే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తొందరగా ఏర్పాటు చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో బాన్సువాడ, బోధన్ నియోజకవర్గంలోని రైతులందరూ ముందుగానే పంటను అమ్మేయడంతో బోనస్ రాలేదన్నారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌజ్ ఉన్నట్లు చూపిస్తే తాను రాజీనామా చేస్తానని, లేకపోతే రేవంత్‌రెడ్డి ముక్కునేలకు రాసి ఇంటికి పోతాడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, సిర్పరాజు, తెలంగాణ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా
హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు ఛైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూ విస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పను లు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిం చే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూ ముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జే ఎఫ్‌ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోలోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టి పెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యా శాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్టు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్టు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో
రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్టు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.

ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సబ్ కలెక్టర్



నందిపేటలో..

బోధన్‌రూరల్,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా బోధన్‌లో ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ వరకు ర్యాలీగా వచ్చి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, కౌన్సిలర్లు డబ్బు, అబ్దుల్లా, ధూప్‌సింగ్,మేనేజర్ ఫారూఖ్,సిబ్బంది పాల్గొన్నారు.

● బోధన్ పట్టణంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ వికాస్ మహతో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నందిపేట: మండల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎస్‌ఐ ఏ.హరిబాబు, మండల విద్యాధికారి అవదూత గంగాధర్ బహుమతులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్స వాల సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆదివారం ప్రజాపాలన అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వ హించారు.విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సాయన్న, సంజీవ్, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది ఉన్నారు.

సుభాష్‌నగర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను, పిచ్చిమొక్కలను తొలగించారు. ఆది వారం నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు. మొద టిరోజు ప్రజాపాలన విజయోత్స వాల్లో భాగంగా ఈ కార్యక్ర మాలను నిర్వహించారు.

మోస్రా: చందూరు, మోస్రా మండలాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు నాగనాథ్, శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 1వ తేది నుండి 9వ తేది వరకు 9రోజుల పాటు ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, ఉపాధ్యాయులు, ఎంపీవో,సీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజాపాలన అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వ హించామని ఎంఈవో తమ్మిరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో సుంకెట్‌కు చెందిన బి.అనుశ్రీ ప్రథమ, మోర్తాడ్‌కు చెందిన ఎం.కార్తిక, ద్వితీయ, బి.అశ్వితలు తృతీయస్థానంలో గెలుపొందగా వారికి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, అశోక్, నర్సింహస్వామి, సబిత, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఎంఈవో అశోక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్ర మంలో భాగంగా ముప్కాల్, బాల్కొండ మండల స్థాయి వ్యాసరచన పోటీలను విద్యా ర్థులకు నిర్వహించినట్టు మండల విద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, బాల్కొండ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండల విద్యావనరుల కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంపై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఎంఈవో రేణుక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో రేణుక, హెచ్‌ఎం రాజన్న, రాంచందర్, పీఆర్‌టీ యు నాయకులు నర్సింహరావులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్రప్రభుత్వ ప్రజాపాలన అనే అంశంపై ఆదివారం మండల విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాధికారి ఎన్ ఆంధ్ర య్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ కుమార్, ఏ రాజేశ్వర్ గౌడ్, సల్లూరి కిషన్ గౌడ్, జి రమేష్, జి దేవదాస్, నరేందర్, సబిత, శైలజా తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్‌లో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవ వ్యాసరచన పోటీలు నిర్వ హించారు. విజేతలకు మండల విద్యాధికారి నరేందర్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: ప్రజాపాలన విజయోత్సవాలో భాగంగా డొంకేశ్వర్ మం డల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు లింగారెడ్డి, సదానంద్, సుబాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 1 నుంచి 9వ తేదీ వ రకు నిర్వహించే విజయోత్సవాలలో భాగంగా ఆదివారం మొదటి రోజు అధికారులు సిబ్బంది ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో విద్యుద్దీకరణ చేపట్టారు.

అధికారులు తీరు మార్చుకోవాలి: బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్ డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన నాయకులతో తిరుగుతున్న అధికారులు తమ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ కండువా కప్పుకొని తిరగాలని మాజీ మున్సిపల్ ఛైర్మన్ కంచెట్టి గంగాధర్, మాజీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో ప్రజలచే తిరస్కరించబడిన వినయ్‌రెడ్డితో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లు వెళ్లడం ఎంత వరకు సమాంజసమని, ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శ్రమించి తీసుకువస్తే స్థల పరిశీలనకు కాంగ్రెస్ నాయకులతో అధికారులు వెళ్లడం సమాంజసం కాదని, రోడ్డుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి ఓడిపోయిన వ్యక్తిగా ఎమ్మెల్యేగా సంబోధించడం వారి పరిపక్వత లేని జ్ఞానానికి నిదర్శనమని, రాబోవు కాలంలో ఇలాంటి సంఘటన లు పునరావృతమైతే అధికారులను తమ కార్యాలయంలో బంధించివేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులు పొల్కంవేణు, కలిగోటప్రశాంత్, దక్షిణమూర్తి,మిర్యాల్కర్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పద్మశాలీలు ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకు సంధ్య దాము అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలో పద్మశాలి సంఘంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలిలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. నూతన అధ్యక్షులు గుర్రం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం మహేష్, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నవీన్ కుమార్, ఉపాధ్యక్షులుగా శ్యామల శివకుమార్, రమేష్, నవీన్, స్వరూప, కార్యదర్శిగా గంగారాం, గంగుల శ్యామ్, చిలుక విజయ్, మిద్ద రమాదేవిలు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ ఛైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, జిల్లా సభ్యులు లోల శంకర్, జిల్లా అధ్యక్షులు యాదగిరి, హన్మాండ్లు, చేనేత ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షులు గంగుల దాస్, చిలుక రాములు, గంగుల లక్ష్మణ్, ఆడెపు శంకర్, రాములు, సత్యం పాల్గొన్నారు.



బోధన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మశాలీలు

ధృడ సంకల్పంతో ఏదైనా సాధించవచ్చు

● మాజీ సర్పంచ్, మోటివేషన్ స్పీకర్ సంజీవ్

తాడ్వాయి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ధృఢ సంకల్పంతో ఏదైనా సాధించవచ్చునని తాడ్వాయి మాజీ సర్పంచ్ మోటివేషన్ స్పీకర్ సంజీవ్ తెలిపారు. ఆయన ఆదివారం మండలంలోని కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ క్లాసును నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ధృఢ సంకల్పం నిబద్ధతతో కూడిన గోల్‌ను ఏర్పాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలను రిపీట్ చేసుకోనడం వల్ల సంకల్పం వలన పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించ గలుగు తారని ఆయన విద్యార్థులకు సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సదాశివనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1995-96లో చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 29 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని, ప్రస్తుత జీవిత స్థితిగతులను ఒకరికొకరు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. చిన్ననాటి ఆటపాటలు ఆడుతూపాడుతూ గడిపి వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా అందరు వారు చదువుకున్న పాఠశాలకు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో 2 కే రన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆదివారం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రన్ నిర్వహించగా జెండా ఊపి స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రా రంభించారు. ఈ కార్యక్రమంలో క్రీడాశాఖాధికారి జగన్నాథం పాల్గొన్నారు.



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, సన్నదాన్యానికి క్వింటాలుకు రూ.500బోనస్ ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం నిర్వహించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అనడానికి ఇదీ నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇట్టెం జీవన్, మండల ఉపాధ్యక్షుడు ముత్తెన్న, ప్రశాంత్, సురేష్, రైతులు, కాం గ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంకాపూర్ గ్రామాన్ని సందర్శించిన భైంసా విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకా పూర్ గ్రామాన్ని ఆదివారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి వాసవి పాఠ శాల విద్యార్థులు సందర్శించారు. గ్రామంలో పంటల అభివృద్ధి, విత్తన ప్లాంట్లు, వ్యవసాయంలో రైతులు అవలంబిస్తున్న పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పంటలను పరిశీలించిన అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. వారికి గురడిరెడ్డి సంఘం కార్యదర్శి అనంత్‌రెడ్డి, కేకే భాజన్న, పంటల సాగు విధానం, గ్రామ అభివృద్ధిపై వివరించారు.

బస్సు, వ్యాన్ ఢీ.. ఒకరికి గాయాలు

ఆర్మూర్‌టౌన్ డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబాష్‌నగర్ వంతెన వద్ద ఆర్టీసీ బస్సు, టాటాఏసీ వాహనం ఢీకొన్న సంఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆర్మూర్ నుంచి నందిపేటకు వెళ్తున్న టాటా ఏసీ వాహనం సుబాష్‌నగర్ వంతెన మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. బస్సు వేగంతో రావడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కాగా టాటాఏసీ వైన్ డ్రైవర్‌కు గాయాలు కావడంతో అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది.

ఢిల్లీలో కేఆర్ సురేష్‌రెడ్డిని కలిసిన రైతులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ప్రాంత పసుపు రైతుల చిరకాల వాంఛ పసుపు ఏర్పాటు విషయమై పార్లమెంట్‌లో రాజ్యసభసభ్యులు కేతిరెడ్డి సురేష్‌రెడ్డిని పసుపు రైతులు ఆదివారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు కేతిరెడ్డి సురేష్‌రెడ్డిని కలిసి పసుపు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి న్యాయవాది ఏలేటి గంగాధర్, చౌట్‌పల్లి సింగిల్ విండో ఛైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్, ఆర్మూర్ ప్రాంత పసుపు రైతుల నాయకులు తదితరులు సురేష్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.



బిచ్కుంద పట్టణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం ఇదే..


బిచ్కుంద గ్రామ పంచాయతీ కార్యాలయం


పిట్లం మండల కేంద్రంలో ఉన్న గ్రామ పంచాయతీ

ఆంధ్రజ్యోతి ఫోకస్


పిట్లం పట్టణం ముఖ చిత్రం ఇదే..

• బిచ్కుంద పట్టణ ముఖచిత్రం ఇదే

బిచ్కుంద, పిట్లం మున్సిపాలిటీలుగా ఏర్పాటయ్యేనా?

• మున్సిపాలిటీగా మారుస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటన
• గత ఏడాదిన్నర క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు • గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్న నియోజకవర్గ ప్రజలు
• ఏడాది గడుస్తున్నా ఫలితం శూన్యమే • కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

నిజాంసాగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వు అయిన జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద, పిట్లం పట్టణాలు మున్సిపాలిటీలుగా ఎప్పుడు ఏర్పడుతాయని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గం లోని మండలకేంద్రాల్లో ఉన్న గ్రామ పంచాయతీలు మేజర్ గ్రామ పంచాయతీలు కావడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పిట్లం, బిచ్కుంద పట్టణాలను పురపాలక సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. కానీ ఆ పార్టీ అధికారం కోల్పోవడంతో పిట్లం, బిచ్కుంద పట్టణాల్లో పురపాలక ఏర్పాటు జాప్యం జరిగింది. అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పిట్లం, బిచ్కుంద పట్టణాల్లో పురపాలక సంఘంగా ఏర్పాటుగా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది గడుస్తున్నా పిట్లం, బిచ్కుంద పట్టణాల్లో పురపాలకం ఏర్పాటుకు అధికారయంత్రం ఎలాంటి చర్యలు చేపట్టలేకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. బిచ్కుంద పట్టణంలో 13వేల జనాభాతో పాటు 19,395 ఓటర్లు కలిగిన 16 వార్డులు ఉన్నాయి. బిచ్కుంద పట్టణాన్ని పురపాలకంగా ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి చేసి పురపాలక వైపు పయనించింది. 2021 పురపాలక సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నప్పటికీ అప్పట్లో తాజా మాజీ ఎమ్మెల్యే బిచ్కుంద, పిట్లం పట్టణాల్లో పురపాలకాన్ని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా ప్రభుత్వానికి అర్జీ ఇవ్వడమే కాకుండా నివేదిక సమర్పించింది. నవంబర్ 2023 అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పురపాలక ఏర్పాటు ప్రక్రియ వెనుక్కి వెళ్లింది. పిట్లం మండల కేంద్రంలోని పిట్లం పట్టణంలో 12,466 ఓటర్లు కలిగి 16వార్డు సభ్యులతో పిట్లం మేజర్ గ్రామ పంచాయతీ కొనసాగుతుంది. పిట్లం పట్టణంలోని సమీపంలో ఉన్న హస్నాపూర్ గ్రామపంచాయతీ ఏర్పడింది. నాగంపల్లి గ్రామం, అన్నారం గ్రామ పంచాయతీలో విలీనమైంది. మార్కెటింగ్ కమిటీ ఉంది. 30పడకల ఆసుపత్రితోపాటు ప్రభుత్వపాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పిట్లం, బిచ్కుంద పట్టణాలపై ఎంతో మక్కువ చూపినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సవతి ప్రేమ అవలంబిస్తూ ఇప్పటికీ పురపాలక ఏర్పాటుపై ఎలాంటి చర్యలు చేపట్టి ముందుకు సాగటం లేదని పిట్లం, బిచ్కుంద పట్టణాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ పట్టణాల్లో గత ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేందుకు 30 పడకల ఆసుపత్రులను కూడా ఏర్పాటు చేసిన విషయం విధితమే. బిచ్కుంద, పిట్లం పట్టణాల్లో పురపాలక ఏర్పాటు అహర్నిశలు చేసిన కృషిచేసినా నిరాశకు గురయ్యారు. జుక్కల్ నియోజకవర్గం లోని కీలకమైన బిచ్కుంద పట్టణం, కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దులు ఉండటం పురపాలకం ఏర్పాటుకు పిట్లం పట్టణం సంగారెడ్డి జిల్లా ఉండటంతో ఇక్కడ మార్కెటింగ్ ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. నియో జకవర్గ పునర్విభజన జరిగితే పిట్లం ఓ నియోజకవర్గంగా మారనుంది. బిచ్కుంద పట్టణం జుక్కల్ నియోజకవర్గం కీలకమైన అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పిట్లం, బిచ్కుంద పట్టణాలు పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని పరీక్షలకు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎంపికైన తోట లక్ష్మీకాంతారావు బిచ్కుంద, పిట్లం పట్టణాల్లో పురపాలక కాలనీ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.




ఆంధ్రజ్యోతి పరిశీలన

కుప్రియల్ శివారులోని సోలార్ వద్ద మలుపులు తిరిగిన రోడ్లు

కోట్లు వెచ్చించినా.. తగ్గని ప్రమాదాలు!

• ప్రమాదకరంగా సదాశివనగర్‌లోని గ్రామాల రోడ్లు • ప్రమాదకర మలుపుల వద్ద రూ.6 కోట్లతో పనులు
• కొద్దిపాటి జాగ్రత్తలు పాటించక తరచూ ప్రమాదాలు • గాల్లో కలుస్తున్న అమాయకుల ప్రాణాలు

సదాశివనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా ఉన్న రోడ్లకు కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టినా ప్రమాదాలు తగ్గడం లేదు. కొద్దిపాటు జాగ్రత్తలు పాటించకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రూ. కోట్లు వెచ్చించినా ప్రాణాలు కాపాడలేకపోతున్నామని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రజల కష్టాలు ఏ మాత్రం పట్టకుండా కుప్రియల్, ధర్మారావుపేట, సదాశివనగర్‌లలోరోడ్లు ఇష్టరితిన వేశారు. ప్రధానమంత్రి గ్రామక్ సడక్ యోజనకింద జాతీయ రహదారి 44 నుంచి మూడేగాం గ్రామం వరకు మంజూరు చేసిన రోడ్డు ప్రమాదకర మలుపులతో ఉండడంతో పట్టపగలే ప్రమాదాలు జరుగుతుంటే రాత్రిఅయితే ఇక అంతే సంగతి అంటూ ప్రజలు వాపోతున్నారు. కుప్రియల్, సదాశివనగర్ శివారులోని సోలార్‌ప్లాంట్ వద్ద మూలమలుపులు చూస్తే మల్లన్న గుట్ట గోడౌన్ల వద్ద రోడ్డు పరిస్థితి చూస్తే రోడ్డు వేసింది బడాబాబుల కోసమా ప్రజల కోసమా అనే సందేహం ప్రతీ ఒక్కరికి కలుగుతుంది.

రోడ్డు నిర్మాణం ఇలా..

ప్రధానమంత్రి గ్రామసడక్‌యోజన కింద 2020లో మల్లన్నగుట్ట జాతీయ రహదారి 44 నుంచి మూడేగాం వరకు 11.17 కిలోమీటర్ల రోడ్డు రూ. 652.33 లక్షల వ్యయంతో మంజూరు చేసి 2022 సంవత్సరం నాటికి పని పూర్తిచేసిన రోడ్డు ఐదు సంవత్సరాల క్రితం నిర్మించారు.

రోడ్డులో పలుచోట్ల ఇబ్బందులు

11 కిలో మీటర్ల రోడ్డు వేసినప్పటికీ పలుచోట్ల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. మల్లన్నగుట్ట గోడౌన్ల వద్ద భారీ వాహనాలు గోడౌన్లలోకి అధిక లోడుతో వెళ్లడంతో ఇరువైపులా రోడ్డు పూర్తిగా ధ్వంసం అయినప్పటికి అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కుప్రియల్ శివారులోని సోలార్ ప్లాంట్ వద్ద కొద్దిపాటి సర్దుబాటు చేసే మలుపులు తొలగించి ఉండే అర్ధరాత్రి కూడా ఇలాంటి ప్రమాదాలు లేకుండా వెళ్లేందుకు బాగుండేదని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒకేచోట మూడు మలుపులు ఉండడం రోడ్డు ఒకవైపు నుంచి చూస్తే ఎక్కడికి వెళ్తుందోనని తెలియని ఆందోళన దగ్గరకువచ్చేంతవరకు సోలార్ ప్రహరీ కూడా అడ్డు ఉండడంతో పలు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కుప్రియల్ గ్రామం వద్ద వేసిన రోడ్డు బీటలు వారడంతో పనులు నాసిరకంగా ఉన్నాయని గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.

ఇలా చేస్తే బాగుండేది

రోడ్డు నిర్మాణం ప్రారంభించే సమయం వరకే గోడౌన్లు నిర్మాణం జరుగుతుందని అధికారులకు తెలిసినప్పటికి ఆ ప్రాంతం వద్దరోడ్డు విస్తరణ పెంచి ఉంటే రోడ్డుకు ఎలాంటి నష్టం జరగకుండా ఉండేదని భారీ వాహనాలు రోడ్డుపైన నిలవడంతో రోడ్డు స్తంభించిపోవడమే కాకుండా వేసిన బీటీ కృంగిపోయిఇబ్బందులు కలుగుతున్నాయి.కుప్రియల్ డంపింగ్ యార్డు వద్ద కొద్దిపాటి మలుపును సరిచేసి ఉంటే బాగుండేది. సోలార్ వద్ద భయంకరమైన మూడు మలుపులను తొలగించేందుకు, సోలార్ ప్లాంట్ యాజమాన్యం అటువైపు రైతులతో మాట్లాడి రోడ్డు పనులు నిర్వహించి ఉంటే భవిష్యత్తు బాగుండేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


కుప్రియల్ శివారులోని సోలార్ వద్ద మలుపు


మల్లన్న గుట్టగోడౌన్ల వద్ద ధ్వంసమైన రోడ్డు

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

వేల్పూర్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి సరఫరా చేసిన పోటీ పరీక్షల పుస్తకాలు, ఇతర రీడింగ్ మేటిరియల్, గ్రంథ నమోదు పట్టికలో నమోదు చేసి పాఠకులకు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. అంతకుముందు భీమ్‌గల్ శాఖ గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి పనులు వేగవంతం చేసి భవనం వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రంథాలయ అభివృద్ధి కోసం సమీక్షించారు. గ్రంథాలయ పాఠకుల కోరిక మేరకు 24గంటలలో గ్రంథాలయంలో వైఫై ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు హామీఇచ్చారు. గ్రంథాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి శాలువతో ఘనంగా సన్మానించారు.


పుస్తకాలను పరిశీలిస్తున్న చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి


చెక్కులను పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్ మండలంలో 23మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు నరేందర్, రమణ, గంగయ్య, రాజేందర్, రేవంత్‌రెడ్డి, మల్లయ్య, మోహన్, రాజేశ్వర్, వినోద్, ప్రవీన్, చిన్నయ్య, రహీం, పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం!

• మురుగు కాల్వల్లో పేరుకున్న చెత్త • రోగాల బారిన పడుతున్న గ్రామ ప్రజలు • పట్టించుకోని అధికారులు

జర దేఖో!!


తడపాకల్‌లో మురుగు నీటితో నిండిపోయిన డ్రైనేజీ


బట్టాపూర్‌లో మురుగుకాల్వపై పెరిగిన పిచ్చిమొక్కలు

ఏర్గట్ల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్తా చెదారం ఎక్కడికక్కడే పేరుకుపోయింది. దోమలు, ఈగలు బెడదతో ప్రజలు అల్లాడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని ప్రధానంగా తడపాకల్, తాళ్ళరాంపూర్, బట్టాపూర్, నాగేంద్రనగర్ గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రమవుతోంది. పలు కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తుండటంతో ఇంటిలో ఉండలేకపోతున్నామని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మురుగు కాలువలోంచి తీసిన చెత్తాచెదారం జానావాసాల్లో కుప్పలు వేసివారం తర్వాత తీస్తున్నారని తాళ్లరాంపూర్‌లో కాలనీ వాసులు చెబుతున్నారు. అటు తడపాకల్ గ్రామంలో గోధావరికి వెళ్లే బీటీ రోడ్డుకు సమీపంలో డ్రైజేని మొత్తం సీసీ రోడ్డును ఆనుకొని ప్రవహిస్తున్నా పట్టించుకోవడం లేదని, మురుగునీరు ఎక్కువైతే రోడ్డుపైనే పారతోందంటున్నారు. బట్టాపూర్ గ్రామంలో పలు కాలనీల్లో మురుగు కాలువలో చెత్తాచెదారంతో పాటు కాలువలపై పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేసుకున్నా అధికారులకు పట్టింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని సంబంధిత శాఖ అధికారులు తరచూ పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

భరించలేని దుర్వాసన వస్తోంది

• అక్తర్, తడపాకల్, గ్రామస్థుడు

మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగల వ్యాప్తితో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

సమస్యను పరిష్కరిస్తాం

• వెంకటేశ్వర్లు, ఎంపీడీవో

గ్రామాల్లో తలెత్తిన పారిశుధ్య సమస్య ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. అలాంటి సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తేవాలి. స్థానిక జీపీ కార్యాలయానికి సమాచారం అందించి వెంటనే పరిష్కరిస్తాం.

గురుకులాలు సమస్యలకు నిలయాలు

(ఐదవ పేజీ తరువాయి)

మరమ్మతుల పేరుతో 5 శాతం కోత విధిస్తూ భవన యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో భవన యజమానులు విసిగి వేసారి మరమ్మతులు చేసేందుకు వెనకడు గు వేస్తున్నారు. భవనాల్లో లీకేజీలు, కిటికీలకు జాలీలు లేకపోవడంతో విషపూరిత కీటకాలు వచ్చే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు మాత్రం భవనాలకు రిపేర్లు చేయించడంలో వెనకడుగు వేస్తు న్నారు. మండల కేం ద్రాల్లో సరైన భవనాలు లేక కొన్ని వసతిగృహాలు జిల్లా కేంద్రంలో కొనసాగుతున్నాయి. ఇలా జిల్లాలో అనేక చోట్ల అద్దె భవనాల్లో కొన సాగుతున్న గురుకులాల భవనాలు సక్రమంగా లేవు. బాత్‌రూమ్‌లు, డైనింగ్ హాల్ సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వసతి గృహాల్లో ఉండేందుకు పిల్లలు జంకే పరిస్థితి ఉంది. కనీసం పిల్లలు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్ కూడా అద్దె భవనాలు కొనసాగుతున్నా భవనాల వద్ద లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. చలికాలం కావడంతో చలి తీవ్రతతో పాటు దోమల బెడద అధికంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ కిటికీలకు దోమతెరలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా పోలీసు బాస్ నియామకమెప్పుడో!?

(ఐదవ పేజీ తరువాయి)

నుంచి నేతలకు సమాచారం అందింది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కూడా సీఎం దృష్టికి కమీషనర్ నియామకంపై తీసుకువెళ్లారు. తమకు కొత్త కమీషనర్‌ను నియమించాలని కోరారు. ఇప్పటి వరకు మాత్రం ఇంకా ఎలాంటి నియామకం చేపట్టలేదు. జిల్లాకు పోలీస్ కమీషనర్‌గా వచ్చేందుకు చాలా మంది ఐపీఎస్ అధికారుల పేర్లు వినిపిస్తున్నా ఇప్పటి వరకు మాత్రం ఖరారు కాలేదు. జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతల సమాచారం బట్టి అందరికి అనుకూలమైన అధికారిని కమీషనర్‌గా నియమించనున్నట్లు తెలుస్తుంది. రాష్ట్ర సర్వీస్‌తో పాటు కేంద్ర సర్వీస్‌లో కీలకంగా పనిచేసిన కొంత మంది ఐపీఎస్‌లు జిల్లాకు వచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. వారు జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలను కలవడంతో పాటు అవకాశం ఇవ్వాలని కోరారు. కీలకమైన కమీషనరేట్ కావడంతో సీనియర్ ఐపీఎస్‌ను నియమించనున్నట్లు తెలుస్తుంది. బాసర జోన్ పరిధిలో కీలకమైన కమీషనరేట్ కావడం వల్ల జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్‌లో పనిచేసే అధికారులకన్న సీనియర్‌కు అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. జిల్లా పోలీస్ కమీషనర్‌గా బాధ్యతలను ఇవ్వడంతో పాటు ఇంచార్జి డిఐజి బాధ్యతలను కూడా కట్టబెట్టనున్నట్లు తెలుస్తుంది. బాసర జోన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరిని డిఐజిగా నియమించలేదు. ఇంచార్జి అధికారులే బాధ్యతలను కొనసాగిస్తు న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొంత మంది ఐపీఎస్ అధికారులను త్వరలో బదిలీ చేయనున్నట్లు తెలుస్తుంది. ఆ బదిలీల్లో భాగంగా జిల్లా కమీష నర్‌ను కూడా నియమించనున్నారని ప్రజాప్రతి నిధుల సమాచారం బట్టి తెలు స్తుంది. జిల్లాలో పూర్తిస్థాయి కమీషనర్ లేకపోవడం వల్ల పర్యవేక్షణ లేకపోవ డంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికా రులపై ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. భూకబ్జాల సెటిల్‌మెంట్లతో పాటు ఇతర ఆరోపణలు వస్తున్నా యి. బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన కొంత మంది అధికారులు ప్రధాన ఆదాయ వనరులపై దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. ఉన్న సమయంలోనే వారు సర్దుకునేందుకు చూస్తున్నారు. కమీషనర్ ఉన్న సమయంలో పూర్తిస్థా యిలో వీలు కాకపోవడం ఇప్పుడు కొంత వరకు వెసులు బాటు ఉండటంతో ఎక్కువ మొత్తంలో వాటిపై దృష్టి పెడుతున్నారు. ఇంచార్జి కమీషనర్ సమీక్షిస్తున్నా ఈ ఆరోపణలు మాత్రం కొంత మంది అధికారులపై తగ్గడం లేదు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు దృష్టి పెడితే త్వరగా కమీషనర్ నియామకం జరిగే అవకాశం ఉంది.

'ఏడాది పాలనలో అభివృద్ధి జరగలేదు'

సుభాష్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకొని మున్సిపల్ కార్పొరేషన్‌లో విజయోత్సవాలు నిర్వ హిం చడం ఎందుకని ఏడాది పాలనలో ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు జరగలేదని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో విజయోత్స వాలు నిర్వహించడాన్ని భారతీయ జనతా పార్టీ ఖండిస్తుందన్నారు. ప్రజా పాలన పేరిట ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకొని ఏడాది పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే విజయోత్సవాలు జరుపుకోవడం ఎందుకని ప్రశ్నించారు. కార్పొరేషన్ పరిధిలో ఏ ఒక్కరికి కూడా నూతన రేషన్ కార్డు ఇవ్వలేదని, వికలాంగులకు, వితంతువులకు పెన్షన్లు ఇవ్వకపో వడం, అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు, ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, ఉచిత విద్యుత్ ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. రేషన్ కార్డు లేకపోవడం వల్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక డివిజన్‌లలో ఎల్ఈడి లైట్లులేక పోవడం, నూతన లైట్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

అర్ధరాత్రి దుకాణాలను తనిఖీ చేసిన ఏసీపీ

ఖిల్లా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):నగరంలోని శనివారం అర్ధరాత్రి నిజామాబాద్ ఏసిపి ఎల్.రాజావెంకట్‌రెడ్డి హల్‌చల్ చేశారు. నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు చేసుకుంటున్న హోటళ్లపై కేసులు నమోదు చేశారు. రాత్రి వేళల్లో హోటళ్లు, దుకాణాలు తెరిచి ఉంచుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన శనివారం అర్ధరాత్రి ఆకస్మికంగా 1, 2, 3, 4, 6 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా తెరిచి ఉన్న హోటళ్లపై కేసులు నమోదు చేసి నిబంధనల ప్రకారం 11గంటలలోపు హోటళ్లను మూసివేయాలని ఆదేశించారు. నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండ్, బోధన్ రోడ్, ఖిల్లారోడ్‌లలో 11గంటలు దాటిన తెరిచి ఉన్న హోటళ్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇకపై నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు కొనసాగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు

కోటగిరి,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కోటగిరి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏడుగురు పోలీస్ కానిస్టేబుళ్లు విధుల్లో చేరారు. ఎండీ. ఫైమద్ అలీ, జయపాల్, అరుణ్ కుమార్, నాగేంద్ర బాబు, అశోక్‌లతో పాటు దివ్య, మౌనిక అనే కానిస్టేబుళ్లు విధుల్లో చేరారు. కొత్త కానిస్టేబుళ్ల నియామకంతో పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత తీరినట్లయింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్, హెడ్ కానిస్టేబుల్ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న ఆరుగురు కానిస్టేబుళ్లు ఆదివారం నవీపేట పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరారని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఇందులో నలుగురు పురుష కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తమ విధులను సక్రమంగా నిర్వహించి డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ సూచించారు.

మాలల సింహగర్జనకు తరలిన నాయకులు



నందిపేట నుంచి మాలల నాయకులు



బోధన్ నుంచి తరలివెళ్తున్న మాలలు

నందిపేట, డిసెంబరు 1: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాల కులస్తులు ఆదివారం హైదరాబాద్‌లోని సింహగర్జన సభకు తరలి వెళ్లారు. మాలల ఆత్మ గౌరవం పేరిట జాతిని ఐక్యత పరిచేందుకు హలో మాల చలో హైదరాబాద్ సింహగర్జన పేరిట భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు పెద్ద ఎత్తున మాలలు బస్‌లు, కార్లలో తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో బుడ్డ సాయన్న, బుడ్డ శివ, నరేష్, లింగం, బొర్రోల్ల సురేష్ ఉన్నారు.

రెంజల్: హైదరాబాద్‌లో తలపెట్టిన మాలల సింహగర్జన సభకు మండలంలోని పలు గ్రామాల నుండి భారీగా నాయకులు తరలివెళ్లారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన మాలల సింహగర్జన సభను విజయవంతం చేసేందుకు మండల మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మాజీ మండల అధ్యక్షులు అనంత్ రావు, ప్రేమ్ కుమార్, పోశెట్టి, నరేష్, సంతోష్, ముత్యం, నరేష్, సామెల్, రాజు, నాగరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: రెండు వర్గాల మధ్య పోరాటం జయ పజయాలకు దారి తీస్తుంది. ఒకే వర్గం మధ్య పోరాటం ఆవర్గం నాశానికి దారితీస్తుంది. అంబేడ్కర్ పిలుపునందు కోని హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే సింహగర్జన కు డిచ్‌పల్లి మండలంలోని 25 గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, విద్యార్థులు, కర్షకులు, మహిళలు తరలివెళ్లారు.

కమ్మర్‌పల్లి: ఎస్సీవర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తు ఆదివారం హైదరాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మాలమహానాడు ఆధ్వర్యంలో మాలల సింహగర్జన భారీ బహిరంగ సభకు కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్, నాగాపూర్ తదితర గ్రామాలకు చెందిన మాల సంఘాలనాయకులు, మహిళలు భారీగా తరలివెళ్లారు. సుప్రీంకోర్టుతీర్పుని వ్యతిరేకిస్తూ వర్గీకరణ ఆపాలని వర్గీకరణ కుదరదని తీర్పుచెప్పిన అదే సుప్రీమ్ కోర్టు మళ్లీ ఇప్పుడు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిస్తు ఉత్తర్వులు జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ హైదారాబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మాలల సింహగర్జన భారీ బహిరంగ సభకు తరలివెలుతున్నట్లు నాయకులు తెలిపారు. కాగా ఆయా గ్రామాలలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రత్యేక బస్సుల్లో సింహగర్జన సభకు తరలివెళ్లారు.

కోటగిరి: రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం మాల మహనాడు నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో హలో మాల, ఛలో హైదరాబాద్ మాలల సింహగర్జన కార్యక్రమానికి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుండి మాల మహనాడు నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల నుండి మాల మహనాడు నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నవీన్, కిషోర్, సాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్,బాల్కొండ మండలాల నుంచి మాలసింహగర్జనకు ఆదివారం వందలాది మంది మాల సంఘ సభ్యులు జైబీం అంటు నినా దాలు చేస్తూ తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో తోట రమేష్ కాంతరావు, విశ్వనాథ్,ధర్మరాజ్, తది తరులు ఉన్నారు.

నవీపేట: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన మాలల సింహగర్జన సభకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాల మహనాడు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామాల నుండి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకుని సమావేశానికి తరలివెళ్లారు.

బోధన్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహనాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆదేశాల మేరకు మాలలు తలపెట్టిన సింహగర్జనను విజయవంతం చేయడానికి బోధన్ డివిజన్ నుంచి వందలాది సంఖ్యలో సింహగర్జన కార్యక్రమానికి బయల్దేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కేంద్ర గిడ్డంగుల ఉద్యోగుల సంఘం ఉభయ రాష్ట్రాల కార్యదర్శి పరిమి కోటేశ్వర్ రావు, మాల మహనాడు జిల్లా అధ్యక్షులు ఎల్లమయ్య, ప్రధాన కార్యదర్శి నీరడి రవి, నాయకులు శ్రావణ్ కుమార్, కారం స్వామి, పాండు, సూర్యకాంత్, కొంద్ర వెంకటి, సంజీవ్, వివిధ మండలాల అధ్యక్షులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా అంతటా పోలీసు కిష్టయ్యకు ఘన నివాళి



పోలీస్‌కిష్టయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కోటగిరి,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం పోలీసు కిష్టయ్య 15వ వర్ధంతిని ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ సాయిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టం మనోహర్, బర్ల మధు, షాహీద్, హమీద్, గణేష్, హంగర్గ స్వరూప, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

● పొతంగల్ మండల కేంద్రంలోనూ పోలీస్ కిష్టయ్య వర్ధంతినిముదిరాజ్ సంఘం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని పోచారం, జానకంపేట గ్రామాలలో ఆదివారం పోలీసు కిష్టయ్య 15వ వర్ధంతిని గ్రామస్థులు, ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు ఒడ్డెన్న, నెల్లి రాజు, రాజ్‌కుమార్, అశోక్, అంజనేయులు, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: పోలీస్ కిష్టయ్య జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిం చాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. ఆదివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘంలో పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా పోలీస్‌కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు ఎర్రోల్ల రాములు, వేల్పూర్ నగేష్, తదితరులు ఆపల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండల ముదిరాజ్ ఆ. ద్వర్యంలో ఆదివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కానిస్టేబుల్ కిష్టయ్య 15వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చింతకాయల రాజు, సెక్రెటరీ వెంకట్, ముదిరాజ్ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిలో యాజమాన్యం నిర్లక్ష్యం లేదు : రజనీకాంత్



మాట్లాడుతున్న రజనీకాంత్

నిజామాబాద్‌అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమ విద్యాసంస్థలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శివ జశ్విత్‌రెడ్డి మృతి బాధాకరమని కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజినీకాంత్ అన్నారు. ఆదివారం నగరంలోని కాకతీయ విద్యాసంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి మృతి తమను తీవ్రంగా బాధించిందన్నారు. తల్లిదండ్రులకు ఆ భగవంతుడు పూర్తి ధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నామన్నారు. విద్యార్థి జశ్విత్‌రెడ్డి మృతి చెందడానికి ఒకరోజు ముందు నుంచి ఘటన చోటు చేసుకునేంత వరకు దిన చర్యను సీసీటీవీ పుటేజీని విడుదల చేశారు. విద్యాశాఖ అధికారులు, పోలీసులు క్యాంపస్‌లోని సీసీటీవీ పుటేజీలను పరిశీలించారన్నారు. కొంత మంది విద్యార్థి మృతికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ప్రచారం చేస్తున్నారన్నారు. వాటిలో ఎలాంటి వాస్తవాలు లేవన్నారు. గురువారం సాధారణ వాంతులు కావడం వల్లే తల్లిదండ్రులకు ఉదయం సమాచారం ఇచ్చామన్నారు. ప్రాథమిక చికిత్స చేయడం వల్లే విద్యార్థి ఉదయం కూడా లేచి హుషారుగానే ఉన్నాడని అన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాస్ ఆర్య

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):హరిదా రచయితల సంఘం ఈనెల 4న తలపెట్టిన ఆరవ మహాసభలను విజయవంతం చేయాలని హరిదా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు తిరుమల శ్రీనివాస్ ఆర్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4న నవ్యభారతి గ్లోబల్ పాఠశాల ఆవరణలో సాయంత్రం మహాసభలు జరుగుతాయని అన్నారు. మహాసభలో సరస్వతీరాజ్ పురస్కారాలను అంద జేయడం జరుగుతుందని అన్నారు. సరస్వ తీరాజ్ హరిదా తెలంగాణ విశిష్ట సాహిత్య పురస్కా రాన్ని ప్రఖ్యాత విమర్శకుడు ఏనుగు నర్సింహారెడ్డికి అందివ్వడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో ప్రముఖ కవయిత్రి పద్మజారెడ్డి, రేణుక, సుజాత, మల్లవరపు చిన్నయ్య, లక్ష్మణ్‌లకు పురస్కారాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.మహాసభలో రాష్ట్రస్థాయి కవిసమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈసమావేశంలో దారం గంగా .దర్, పంచరెడ్డిలక్ష్మణ్,మద్దుకూరి సాయిబాబు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ఆర్మూర్‌టౌన్ డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని జాతీయరహదారి 44 రిలియన్స్ పెట్రోల్‌బంక్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో పెర్కిట్‌కు చెందిన శ్రీరాం అశోక్ (55) మృతి చెందాడు. ఆదివారం ఉదయం తమ పంట పొలాలకు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రైతు శ్రీరాం అశోక్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిసింది. సంఘటన స్థలాన్ని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పరిశీలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఘన్‌పూర్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం

డిచ్‌పల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ గ్రామ శివారు దూసుగాం రోడ్డు పక్కన ఉన్న చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయం స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వారు గ్రామ ప్రతినిధులు తెలిపారు.

ఫార్మాసిటీ, ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు ప్రజాపోరాటాల విజయమే



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

డిచ్‌పల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగిచర్ల ఫార్మాసిటీ, దిలవార్‌పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రభుత్వం రద్దు చేయడం శుభపరిణామమని ఇది ప్రజాసంఘాల ఉద్యమాలతోనే ప్రభుత్వం దిగివచ్చిందని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. ఆదివారం ఆయన డిచ్‌పల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం సాగునీటి ప్రాజెక్టుల కొరకు భూమిని సేకరించిన్నప్పుడు ఆ భూమిని వదిలి వెళ్లిపోయిన గ్రామస్థులకు గ్రామ నిర్మాణం చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వరికి ఇచ్చిన విధంగానే బో నస్‌ను మొక్కజొన్న,పెసర్లు, శనిగెలు, వేరుశనగాలకు బోనస్‌తో పాటు మద్దతు ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో దాసు, వేల్పూరి భూమయ్య, సూర్యశివాజీ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఉన్నారు.

తగ్గిన చలి తీవ్రత

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా జిల్లాలో చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. గత వారం రోజుల క్రితం 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదు కాగా ఆదివారం జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు 19.8 డిగ్రీలకుచేరుకున్నాయి. గతకొద్దికాలంగా చలి తీవ్రతతో ఇబ్బంది పడ్డ ప్రజలు చలి తీవ్రత తగ్గడంతో కొంత ఊరట చెందారు. ఆదివారం డిచ్‌పల్లి మండలం కొరట్ పల్లిలో 20.4, డిచ్‌పల్లి, కోటగిరిలో 20.7, బెల్లాల్‌లో 20.8, ధర్పల్లి,ఎడపల్లి, వేల్పూర్, మోస్రా, చంద్రూర్‌లలో 20.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

చెక్‌పోస్టు తనిఖీ

కోటగిరి,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని పలు ఇసుక క్వారీలతో పాటు చెక్‌పోస్టును ఆదివారం రాత్రి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లయ్య తదితరులున్నారు.

విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతం,రాజేశ్వర్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థి మృతి బాదాకరమని విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):కార్తీక అమావాస్యను పురస్కరించుకొని నగరంలోని నాగారంలో గల గోశాలలో ఇందూరు గోసేవా సమితి ఆధ్వర్యంలో గోమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం నాగారంలోని గోశాలలో నిర్వహించిన గోపూజలో కలశ గౌరీ పూజ నిర్వహించి గోమాతకు పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ముకేష్ సింగ్, వీరమల్లి రమేష్, రజినీకాంత్, దేవేం దర్, వెంకటరమణ, శ్రీనివాస్, తిరుపతి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం దొంగలకు రిమాండ్

మోర్తాడ్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రి ధాన్యాన్ని ఎండబెట్టి సంచులలో నింపిన ధాన్యం సంచులను దొంగించిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్సై బి.విక్రం తెలిపారు. గత 29న రాత్రి వేళల్లో తమ ధాన్యాన్ని దొంగిలించారని, ఎర్ర గంగాధర్ ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు. శనివారం రాత్రి పోలీస్‌సిబ్బంది శౌకత్‌అలీ, ప్రసన్నకుమార్, తిరుపతిలు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బోదస్ మహేందర్, బత్తుల సుమన్, అలకుంట శ్రావణ్‌లను పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. వారు దొంగిలించిన వడ్ల సంచులను రికవరీ చేసి కమ్మర్‌పల్లి పీఎస్‌కు అందించిన, ఏర్గట్ల పీఎస్‌కు సంబంధించిన రెండు కేసులు, బాల్కొండ పీఎస్‌కు ఒక కేసు, దొంగతనం చేసిన వడ్లను రికవరీ చే సి దొంగలను రిమాండ్‌కు పంపామని ఎస్సై తెలిపారు.

'లెక్చరర్ గోవర్ధనగిరితో ఎలాంటి విభేదాలు లేవు'

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత నెల 29న గుండెపోటుతో మృతి చెందిన లెక్చరర్ గోవర్ధనగిరితో తనకు ఎలాంటి విబేదాలు లేవని అదే కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న వి.రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు గోవర్ధనగిరికి విబేదాలు ఉన్నట్లు పత్రికల్లో వచ్చిన కథనంలో వాస్తవం లేదన్నారు. అది పూర్తిగా నిరాధారమన్నారు.